13 నుంచి విత్తన అమ్మకాలు ప్రారంభం

వరి పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు ఆచార్య ఎన్‌జి రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల 13 నుండి విత్తన అమ్మకాలు ప్రారంభమవుతాయని కేంద్రం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. స్టాక్ తక్కువగా ఉన్నరకాలు కిలో ప్యాకింగ్‌లో మాత్రమే ఇస్తారని చెప్పారు. బ్రీడర్, ఫౌండేషన్, సర్టిఫైడ్ తదితర రకాల విత్తన రకాల దిగుబడిలో ఎటువంటి వ్యత్యాసమూ ఉండదని రైతులు గమనించాలని కోరారు. విత్తనాల అమ్మకం ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకూ సాగుతాయని తెలిపారు. గ్రామం లేదా మండల రైతులందరూ కలిసి 50 బస్తాల కన్నా ఎక్కువ కొనుగోలు చేస్తే రైతుల వద్దకే విత్తనాలు పంపుతారని తెలిపారు.

బాబోయ్ ఎండలు..!

- రుతుపవనాల మందగమనంతో ఠారెత్తిస్తున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- సుమారు 40 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదు
- ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం
- సాగునీరు విడుదల చేసినా నారుమడులు వేయలేని పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన వారం రోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. నిప్పుల కుంపటి మాదిరిగా వాతావరణం తయారైంది. ఉదయం ఎనిమిది గంటలకే ఎండ తీవ్రత పెరిగిపోతుండగా, పది గంటల తర్వాత రోడ్డుపైకి రావాలంటే జనం భయపడే పరిస్థితి నెలకొంది. ఎండల దెబ్బకు చిన్నా, పెద్దా తేడా లేకుండా అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో దాదాపు 40 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముందుగానే రుతుపవనాలు రావడంతో ఈ ఏడాది వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందుతామని జనం ఆనందపడ్డారు. వచ్చినట్లే వచ్చిన ఈశాన్య రుతుపవనాల మందగమనంతో మే నెలలో సైతం చూడని ఎండలను జూన్‌లో జనం చూస్తున్నారు. ఏదైనా పని మీద బయటికి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ఎండ తీవ్రతతోపాటు విపరీతమైన ఉక్కపోతతో జనం మరింత ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఉక్కపోతతో తల్లడిల్లుతున్న పిల్లలను సముదాయించడం తల్లులకు కష్టతరంగా మారింది. మధ్యాహ్నం 12 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం ఐదు గంటలు దాటితే తప్ప ఎవరూ ఇంటి నుంచి కాలు బయట పెట్టడం లేదు. ఎసి, కూలర్ సదుపాయం ఉన్న వారు ఎక్కువగా వాటి కింద సేదతీరుతుండగా, సామాన్య ప్రజానీకం ఎండతీవ్రతకు అల్లాడిపోతున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా రహదారులన్నీ సిమెంట్ రోడ్లుగా మారిపోయాయి. ఇళ్లు సైతం కాంక్రీటు శ్లాబులతో ఉన్నాయి. దీంతో ఎండతీవ్రత మరింత ఎక్కువగా ఉంటోంది. ఉక్కపోతకు చెమటలు విపరీతంగా పట్టడంతో త్వరగా అలసిపోయి జనాలు నీరసపడుతున్నారు. కూల్‌డ్రింకులు, జ్యూస్‌లు, పళ్ల రసాల దుకాణాలకు జనం క్యూ కడుతున్నారు. ముఖ్యంగా ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, తణుకు వంటి పట్టణాల్లో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోంది. వర్షం ఎప్పుడు కురుస్తుందా అని జనాలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో వ్యాపారాలు సైతం సరిగా సాగని పరిస్థితి ఏర్పడింది. మామిడి పండ్లతోపాటు ఇతర పండ్ల దుకాణాల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎండలకు పండ్లు త్వరగా పాడవుతుండటంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. జూన్ మొదటివారం గడుస్తున్నా ఎండల తీవ్రత ఉంది. ముఖ్యంగా డిఎస్‌సి పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు ఎండదెబ్బకు అల్లాడిపోతున్నారు.

ఖరీఫ్ సాగుపై ప్రభావం..

ఈ ఏడాది ముందుగా రుతుపవనాల రాకతో వర్షాలు కురవడం, జూన్ ఒకటిన పంట కాలువకు సాగునీరు విడుదల చేయడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. ఈ ఏడాది ముందస్తుగానే ఖరీఫ్ సాగు ప్రారంభమవుతుందని అంతా భావించారు. రుతుపవనాల మందగమనంతో ఎండల తీవ్రత పెరిగిపోయింది. దీంతో రైతులు నారుమడులు వేసేందుకు వెనుకంజ వేసిన పరిస్థితి ఏర్పడింది. మెట్ట ప్రాంతంలో బోర్ల కింద సైతం రైతులు నారుమడులు వేయకుండా ఆగిపోయారు. రెండు జిల్లాల్లో దాదాపు నాలుగున్నర లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుకు సన్నద్ధమయ్యారు. త్వరితగతిన నారుమడులు వేస్తే ఖరీఫ్ పంట ముందుగానే కోతకు వస్తుందని అంతా భావించారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని ఎండల తీవ్రత పెరగడంతో సాగు ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిస్తే తప్ప రైతులు నారుమడులు వేసే పరిస్థితి కనిపించడం లేదు. వర్షాలు ఆలస్యమయ్యే కొద్ది ఖరీఫ్ సాగు మరింత ఆలస్యం కానుంది. ఈ ప్రభావం వచ్చే రబీపైనా పడనుంది.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రశాంతంగా ప్రారంభమైన డిఎస్‌సి పరీక్షలు

- జిల్లావ్యాప్తంగా 89.54 శాతం హాజరు నమోదు
- పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మెగా డిఎస్‌సి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగాయి. గంట ముందుగానే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రావడంతో వాళ్లకు సంబంధించిన పత్రాలను పరిశీలించి కేంద్రంలోకి అనుమతించారు. జిల్లాలో భీమవరంతోపాటు మిగిలిన ప్రాంతాల్లో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం భీమవరం డిఎన్‌ఆర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో పరీక్ష జరిగింది. మిగిలిన కేంద్రాల్లో పరీక్ష జరగలేదు. ఉదయం పరీక్షకు 110 మంది హాజరు కావాల్సి ఉండగా వంద మంది హాజరయ్యారు. 10 మంది గైర్హాజరయ్యారు. మద్యాహ్నం 110 మందికి 97 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. 89.54 శాతం హాజరు నమోదైంది. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిఇఒ నారాయణ ప్రకటించారు. భీమవరం డిఎన్‌ఆర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ నాగరాణి ఆకస్మికంగా పరిశీలించారు. కలెక్టర్ వెంట డిఇఒ ఇ.నారాయణ, చీఫ్ సూపరింటెండెంట్ తంగిరాల హరి ఆనంద్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.అంజన్ కుమార్ ఉన్నారు.

పని గంటల పెంపు కార్మికులకు ద్రోహమే

మోడీ మెప్పు, కార్పొరేట్లకు లాభం కోసమే పనిగంటల పెంపు - సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శ

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో కార్మికుల పని గంటలు 8 నుండి 12 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం పెంచడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్రానికి పూర్వం, స్వాతంత్రం తర్వాత కార్మికవర్గం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి 44 రకాల కార్మిక చట్టాలు సాధించుకున్నారన్నారు. ఇప్పటివరకు ఏ ప్రధానీ చేయని విధంగా మోడీ కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేసి, కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు 44 చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారని తెలిపారు. 50 లక్షల మంది కార్మికులు పని చేస్తున్న షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో 13 ఏళ్లుగా కనీస వేతనాల సవరణ జరగలేదని, కనీస వేతనాల బోర్డును నియమించలేదని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు పథకాలను పునరుద్ధరించలేదని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమానవేతనం అమలు చేయడం లేదని అన్నారు. వీటి అమలుపై నోరు మెదపని చంద్రబాబు ప్రభుత్వం మోడీ విధానాలను అమలు చేయడానికి తహతహలాడుతోందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త లేబర్‌కోడ్స్‌ను తెచ్చి, కార్మికవర్గం హక్కులను హరించాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. జులై 9న దేశవ్యాప్త కార్మిక, కర్షక సమ్మె నేపథ్యంలో చంద్రబాబు మోడీ మెప్పు కోసం రాష్ట్రంలో లేబర్ కోడ్‌ల అమలు కోసం రూల్స్ రూపొందించారని మండిపడ్డారు. పని గంటల పెంపు కార్మికుల కుటుంబాల ఆదాయం పెంపు కోసం కాదని, కార్పొరేట్ లాభాల కోసమే ఈ చట్టాల మార్పు అని దుయ్యబట్టారు. కార్మికుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే పెరిగిన ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనాల సవరణ వెంటనే చేయాలని, మహిళల రక్షణకు చర్యలు చేపట్టాలని, లేబర్ కోడ్‌లు తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆదర్శనీయులు వెంకటపతిరాజు

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

వెంకటపతిరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ ఉద్యోగులు కలిదిండి వెంకటపతిరాజును ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. స్థానిక మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద సిపిఎం పట్టణ నేత కలిదిండి వెంకటపతిరాజు వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీతారాం పులమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ వెంకటపతిరాజు నిజాయతీ కలిగిన ప్రభుత్వ ఉద్యోగిగా పని చేశారన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో నిర్విరామంగా ఉదయం నుండి సాయంత్రం వరకు పని చేసేవారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ వెంకటపతిరాజు ఆదర్శమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పార్టీ కార్యక్రమాల్లో చాలా చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. చివరిశ్వాస వరకు పార్టీ పట్ల అచంచలమైన విశ్వాసంతో నిజాయితీతో ఆదర్శంగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, కార్యకర్తలు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, బొక్కా సత్యనారాయణ, వడుగు వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, కె.రత్నకుమారి, లత, నాగరాజు పాల్గొన్నారు.

రాధకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

రాధ మృతి తీరనిలోటు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఆచంట

ఐద్వా సీనియర్ నాయకులు కరుటూరి రాధ (85) మృతి తీరనిలోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. రాధ అంత్యక్రియలు శుక్రవారం స్థానిక చెమ్మచెరువు వెళ్లే రహదారిలో ఉన్న కైలాసగిరిలో నిర్వహించారు. తొలుత రాధ కుమార్తె అరుణ, అల్లుడు సత్యనారాయణ, కుటుంబ సభ్యులు, సిపిఎం నేతలు రాధ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ రాధ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రాధ కుమార్తె అరుణ, అల్లుడు సత్యనారాయణ మాట్లాడుతూ తణుకు కార్యక్రమానికి వెళ్లొచ్చేలోపు ఆకస్మికంగా మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, మహిళా నేత వెంకటలక్ష్మి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణరాజు, నేత శారదాదేవి, సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, మండల కమిటీ సభ్యులు గుత్తుల రంగారావు, సిర్రా నరసింహమూర్తి, తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, కొండేటి సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు, రాపాక సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరుడు, తోటపల్లి సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాధ మృతి సిపిఎంకు తీరనిలోటు

భీమవరం: సిపిఎం నేత కరుటూరి రాధ మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, రాష్ట్ర నేత మంతెన సీతారాం అన్నారు. రాధ మృతి పట్ల వారు సంతాపం తెలిపి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు రాధ, ఆమె భర్త కరుటూరి సత్యనారాయణ ఎర్రజెండా అడుగుజాడల్లో నడిచారని కొనియాడారు.

కాల్వలు, డ్రెయిన్ల నిర్వహణ పనులు నాణ్యతతో చేపట్టాలి

ఉప్పుటేరు డ్రెడ్జింగ్ పనులకు రూ.9 కోట్లు మంజూరు - కలెక్టర్ చదలవాడ నాగరాణి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని కాల్వలు, డ్రెయిన్ల నిర్వహణా పనులను అత్యంత నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆమె జిల్లాకు మంజూరైన ఇరిగేషన్, ఒఅండ్‌ఎం పనుల నిర్వహణపై జలవనరుల శాఖాధికారులతో సమీక్షించారు. జిల్లాలోని డ్రెయిన్లు, కాల్వల్లో తూడు తొలగింపు, పూడికతీత పనులకు, గట్లను పటిష్టపర్చేందుకు కాలువలకు సంబంధించి రూ.13.66 కోట్లు, డ్రెయిన్లకు సంబంధించి రూ.12 కోట్లు మంజూరయ్యాయన్నారు. సాగు, తాగునీటికి ఇబ్బంది లేనివిధంగా పనులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. భీమవరంలోని ప్రధాన కాలువలో పేరుకుపోతున్న చెత్తను కనీసం 15 రోజులు ఒకసారి తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఉప్పుటేరు డ్రెడ్జింగ్ పనులకు రూ.6 కోట్లు, రూ.3 కోట్లు రెండు ప్యాకేజీల కింద మొత్తం రూ.9 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచామని తెలిపారు. సమావేశంలో ఇఇ కెనాల్స్ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇఇ డ్రెయిన్లు సిహెచ్.సత్యనారాయణ, డిఇలు కె.శ్రీనివాస్, కె.ధర్మజ్యోతి, సిహెచ్.వెంకటనారాయణ, డిఎన్ వివిఎస్.మూర్తి, ఎఇ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గొడౌన్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

రైతుల ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు నిర్మిస్తున్న బహుళ ప్రయోజన గొడౌన్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వివిధ సహకార అంశాలపై అధికారులతో సమీక్షించారు. రైతులకు ప్రయోజనకరంగా ఉండే గొడౌన్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి మొదటి దశ కింద నాబార్డ్ 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 24 గొడౌన్లను మంజూరు చేసిందని, వీటిలో 14 గొడౌన్లు పూర్తయ్యాయని తెలిపారు. 10 గొడౌన్లు పురోగతిలో ఉన్నాయన్నారు. పూర్తయిన 14 గొడౌన్లను పిఎసిఎస్‌లకు అప్పగించినట్లు తెలిపారు. ఇవి గిడ్డంగుల అభివృద్ధి నియంత్రణ సంస్థ రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలోని మొత్తం 122 పిఎసిఎస్‌లకు గాను 121 పిఎసిఎస్‌లను కంప్యూటరైజ్డ్ చేయడం జరిగిందన్నారు. ఈ వారంలో మిగిలిన ఒక్క పిఎసిఎస్‌ను కూడా కంప్యూటరైజ్డ్ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, నాబార్డ్ డిడిఎం ఎల్.నిషాయంత్, మార్కెటింగ్ శాఖ ఎడి కె.సునీల్‌కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్.దేవానంద కుమార్, అగ్రికల్చర్ మార్కెటింగ్ డిఇ మల్లేశ్వరరావు, డిసిసిబి ఎజిఎం.శంకర్ నారాయణ పాల్గొన్నారు.

పుస్తకాల పేరుతో విద్యాసంస్థల వ్యాపారం

పట్టించుకోని అధికార యంత్రాంగం - ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్



పుస్తకాల గదికి తాళం వేసిన విద్యాశాఖ సిబ్బంది

ప్రజాశక్తి - ఆకివీడు

కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల పేరుతో వ్యాపారం చేస్తున్నా విద్యా శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పుస్తకాల వ్యాపారం పేరుతో రూ.వేలల్లో వసూలు చేస్తున్నారన్నారు. స్థానిక చైతన్య విద్యాసంస్థలో పుస్తకాల అక్రమ విక్రయాన్ని ఆయన విద్యార్థి నాయకులతో కలిసి శుక్రవారం అడ్డుకున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన రెండు గంటల తర్వాతగాని అక్కడకు అధికారులు చేరుకోకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై మోయలేని భారం మోపుతున్నాయని విమర్శించారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖాధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం, చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి జిల్లాలోని అన్ని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మండల విద్యాశాఖాధికారులకు సమాచారం అందించగా సిఆర్‌ఎంటి పిఎస్‌వికె.పరమేశ్వరి వచ్చి అక్కడ పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలున్న గదులకు తాళాలు వేసి వెళ్లిపోయారు. ఆందోళనకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నాగేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు కె.గోవింద్, కె.రోహిత్, పట్టణ నాయకులు సాయి, వంశీ, సాయికృష్ణ తదితరులు నాయకత్వం వహించారు.

'యోగా సరే మోడీ.. ఉపాధి బకాయిలు చెల్లించండి'

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న చిన వీరభద్రరావు

ప్రజాశక్తి - ఇరగవరం

'యోగా సరే మోడీ.. ఉపాధి బకాయిలు చెల్లించండి' అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఇరగవరం మండలం రేలంగి రైల్వే స్టేషన్ రోడ్డులో పని చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే దేశంలో కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తూ తిండి పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తామని, అందుకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయిస్తామని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచుతామని, కూలీలకు పని ప్రదేశంలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని నమ్మబలికారని గుర్తు చేశారు. అనంతరం అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం గడిచిన 11 సంవత్సరాల్లో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా ప్రతియేటా బడ్జెట్లో నిధులకు కోత పెడుతుందని విమర్శించారు. వేసవిలో చెల్లించాల్సిన అలవెన్స్ ఎత్తివేసిందని, తాగునీరు, తట్ట, పార, గడ్డపార వంటి వాటికి చెల్లించే పారితోషకాలు పూర్తిగా రద్దు చేసి అనేక కుట్రలకు పూనుకుంటుందని. ఆయన ఆరోపించారు. చేసిన పనికి మూడు మాసాలుగా డబ్బులు చెల్లించకుండా కూలీలను ఆకలితో మాడుస్తోందని, మరోపక్క యోగాతో ఆరోగ్యం కాపాడుకోవాలని ప్రసంగాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో చేతివృత్తిదారుల సంఘం నాయకులు ఇల్లిందలపర్తి సత్యనారాయణ, ముప్పిడి నవీన, బూర మాణిక్యాలరావు, కడలి సత్యవతి, టి.ఉష, ఎం.రాణి, యు.సోమాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపీ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రాష్ట్రపతి రోడ్డులో పని గంటలు పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పని గంటల పెంపు ఉపసంహరించుకోవాలని, రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలు నిలిపి వేయాలని, కార్మికులను బానిసలుగా మార్చే విధానం మానుకోవాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పెద్దత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ 50 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్న షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో గత 13 సంవత్సరాలుగా కనీస వేతనాల సవరణ జరగలేదని, కనీస వేతనాల బోర్డును నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవేమీ పట్టకుండా మోడీ ప్రభుత్వ విధానాలను అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం తహతహలాడుతోందని విమర్శించారు. కార్మికులపై చిత్త శుద్ధి ఉంటే పెరిగిన ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనాల సవరణ వెంటనే చేయాలని, మహిళల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. తక్షణమే పని గంటల పెంపు తదితర నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్,ఆదినారాయణబాబు, పి.గణేష్, వై.మంగ, కె.రమణ, అరుణ, గంగాధర్, రవి, అనంతలక్ష్మి, కేశవరావు, లోవరాజు, నారాయణ, శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లాకర్లో బంగారం మాయం

బ్యాంక్ వద్ద బాధితురాలి ఆందోళన

మద్దతు తెలిపిన సిపిఎం

గ్రామీణ బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

ప్రజాశక్తి - ఆకివీడు

బ్యాంకు లాకర్లో దాచిన బంగారం మాయం కావడంతో ఆ బ్యాంకు బ్రాంచి వద్ద బాధితురాలు తన బంధువులతో కలిసి ఆందోళన చేపట్టిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ముస్లిం వీధికి చెందిన వల్లభుని శ్రీపూర్ణ లక్ష్మి స్థానిక ఎపి గ్రామీణ బ్యాంక్ లాకర్లో బంగారం దాచుకుంది. గత నెల 15న శుభకార్యానికి వెళ్లే నిమిత్తం బంగారం కోసం బ్యాంకుకు వెళ్లింది. అయితే బ్యాంకు లాకర్లో కొన్ని నగలు కన్పించకపోవడంతో ఆందోళనకు గురైంది. సుమారు 27 కాసుల బంగారం మాయమైనట్లు గుర్తించి బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసింది. అధికారులు స్పందించకపోవడంతో దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆకివీడు ఎస్ఐ హనుమంతు నాగరాజు రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. బ్యాంక్ అధికారుల నుంచి సీసీ ఫుటేజీ అడిగారు. అయితే బ్యాంక్ అధికారులు సీసీ ఫుటేజీ విషయంలో తాత్సారం చేయడంతో బ్యాంకు వద్ద శ్రీపూర్ణలక్ష్మి, ఆమె భర్త వర్మతోపాటు బంధువులు ఆందోళనకు దిగారు.

బ్యాంకు వద్ద బాధితురాలి ఆందోళనకు సిపిఎం నాయకులు మద్దతు పలికారు. ఆకివీడు ఎస్ఐ హనుమంతు నాగరాజు ఆందోళనకారులను శాంతింపజేశారు. సోమవారం వరకు సీసీ ఫుటేజ్ ఇచ్చేందుకు బ్యాంకు అధికారులకు ఎస్ఐ గడువు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వర్మ, సందక సూరిబాబు, దోకల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్ ప్రారంభించి మాట్లాడుతున్న ఎంఎల్ఎ అంజిబాబు

ప్రతి గ్రామానికీ స్వచ్ఛమైన తాగునీరు

రాయలంలో క్లోరినేషన్ ప్లాంట్ ప్రారంభించిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ, శివారు ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తామని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం మండలంలోని రాయలం గ్రామంలో ఇనిషియేటివ్ ఇంజినీరింగ్ (ప్రైవేట్) వారు నూతనంగా నిర్మించిన క్లోరినేషన్ ప్లాంట్‌ను ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. పిడబ్ల్యుఎస్ స్కీమ్-2 కింద సుమారు రూ.6 లక్షల వ్యయంతో రాష్ట్రంలోనే మొదటి క్లోరినేషన్ ప్లాంట్‌ను రాయలంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి విడతగా భీమవరం నియోజకవర్గంలో ఏర్పాటు చేశామని, రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లోను ఈ క్లోరినేషన్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. మెగ్గెన్ నియోజకవర్గంగా భీమవరాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో క్లోరినేషన్ ప్లాంట్ ఆర్గనైజర్ రాజు బొమ్మా, లోకేష్, గొల్ల, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేత తల్లమ్మచెరువు టీమ్

ప్రజాశక్తి - ఉండి

వెలివర్రు ప్రీమియర్ లీగ్ విజేతగా మండలం తల్లమ్మ చెరువు క్రికెట్ టీం నిలిచింది. వెలివర్రులో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో తల్లమ్మ చెరువు (దివ్యల్లేరు) గ్రామ క్రికెట్ టీం మొదటి బహుమతిగా రూ.35 వేలు గెలుపొందినందుకు ఆ గ్రామ వైసిపి నాయకులు దండ రమేష్, మత్తి మధుబాబు టీం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా రమేష్, మధుబాబు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో తల్లమ్మ చెరువు టీం మొదటి బహుమతి సాధించడం గ్రామానికి ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి గ్రామంలో యువత వేసవి సెలవులను దుర్వినియోగం చేసుకోకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లమ్మ చెరువు కెప్టెన్ అనిసే సతీష్, దండ హరీష్, దండ సురేష్ బాబు, ఫణి బాబు, మత్తే వంశీ, నక్కా సంతోష్, మద్దాలిపటేల్ అభినందించారు.

శ్రీముకుంద 1 గ్రామ్ గోల్డ్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ రోడ్డులో నూతన శ్రీముకుంద వన్ గ్రామ్ గోల్డ్ షోరూమ్‌ను ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో వన్ గ్రామ్ గోల్డ్‌కు ఎంతో క్రేజ్ ఉందని, బంగారు నగలకు దీటుగా వన్ గ్రామ్ గోల్డ్‌లో సైతం అన్ని రకాల ఆభరణాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. నిర్వాహకులు సిహెచ్ కిషోర్, వి.రంజిత్ మాట్లాడుతూ తక్కువ బడ్జెట్‌లో బంగారు వంటి ఆభరణాలను కొనుగోలు చేసుకునేందుకు ఇదొ మంచి మార్గమని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన నాయకులు బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, షోరూం సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం నా మొక్కా - నా-శ్వాస కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పర్యావరణ ప్రేమికులు కలిసి స్థానిక ఆర్టిసి డిపో దగ్గర నుండి పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమం రాబోయే తరాల వారికి ఊపిరి పోస్తాయన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

16న యోగాకు వేదిక సిద్ధం

ప్రజాశక్తి - మొగల్తూరు

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16న నిర్వహించనున్న యోగా ప్రదర్శన కార్యక్రమానికి వేదిక సిద్ధం చేయాలని ఆర్‌డిఒ దాసి రాజు సిబ్బందికి సూచించారు. కెపి.పాలెం బీచ్‌లోని పాండురంగ స్వామి ఆలయ సమీపంలో యోగా కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆ స్థలాన్ని ఆర్‌డిఒ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిఎల్‌పిఒ జ్యోతిర్మయి, తహశీల్దార్ కె.రాజు కిషోర్, ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి, పంచాయతీ కార్యదర్శులు చిట్టూరి నాగేశ్వరరావు, ఎం.సత్యనారాయణ ఉన్నారు.

మణికంఠ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఉండి

జనసేన నాయకుడు శేషపు మణికంఠ సేవలు ఎనలేనివని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. శేషపు మణికంఠ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం మహాదేవపట్నంలోని సన్ రైజ్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తిగ శ్రీనివాస్, కరిమెరక నాగరాజు మాట్లాడుతూ నేటి యువత తమ పుట్టినరోజు వేడుకల్లో పాశ్చాత్య సంస్కృతిని ప్రతిబింబిస్తుంటే శేషపు మణికంఠ దానికి భిన్నంగా వృద్ధాశ్రమంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. సాయంత్రం 'హెల్పింగ్ హాండ్స్' సభ్యులు సాయిరాం ఆధ్వర్యంలో మణికంఠ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిర్వహించిన సుమారు 50 మంది యాచకులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మి శ్రీనివాస్, టిడిపి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, జనసేన మండల అధ్యక్షులు యర్రా రవి, నాయకులు కరిబండి అప్పారావు, కంకణాల బాలకృష్ణ, మోపిదేవి హరి, ఆశ్రమం నిర్వాహకులు వాణి, వృద్ధులు పాల్గొన్నారు.

కెపి పాలెంలో ఇంటి పరిశీలన

మొగల్తూరు:మండలంలోని కెపి.పాలెంలో ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇంటిని ఆర్‌డిఒ దాసిరాజు శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన అభ్యంతరం లేని స్థలంలో నిర్మించుకున్న ఇల్లుకు ఆమోదం తెలిపేందుకు ఆ ఇంటిని పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రాజుకిషోర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎన్‌హెచ్ 165 భూములపై అభ్యంతరాల స్వీకరణ

కాళ్ల:ఎన్‌హెచ్ 165 జాతీయ రహదారి అభివృద్ధి పనుల కోసం సేకరించాల్సిన భూములపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని భీమవరం ఆర్‌డిఒ జి.సుందరసింగ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కోలనపల్లి, సీసలి, జక్కరం, కోపల్లె, పెదఅమిరం, వేంపాడు గ్రామాల్లో సేకరించవలసిన భూముల వివరాలను ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులో పెట్టినట్లు తెలిపారు. అభ్యంతరాలుంటే ఈనెల 14వ తేదీలోగా తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి తెలపాలని కోరారు.

బాధితులకు వాకర్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు అర్బన్

పెదమామిడిపల్లి గ్రామానికి చెందిన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు పేద రోగులకు 23 వేల రూపాయల విలువైన మందులను వాకర్స్ క్లబ్, పాలకొల్లు తరఫున అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు క్లబ్ సభ్యులతో కలిసి శుక్రవారం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న మరోకరు నరసింహస్వామి, నరాల సంబంధిత చికిత్స పొందుతున్న కుక్కల వేపాలస్వామికి, వృద్ధాప్య సమస్యలు ఎదుర్కొంటున్న కడలి నరసింహారావు మందులు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్‌రావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నరసాపురం:రక్తదానం ప్రాణదానంతో సమానమని మండల పశువైద్యశాఖ అధికారి ఇంజేటి సురేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో డాక్టర్ సురేంద్ర, సిబ్బంది నారా కృష్ణస్వామి, చందుకుమార్, ఎం.గంగాధర్ సిబ్బంది కలిసి రెడ్‌క్రాస్ భవనంలో రక్తదానం చేశారు. ప్రతి మూడు నెలలకోసారి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణం నిలవవచ్చన్నారు.

క్రమశిక్షణ గల విద్య యుకె సొంతం

కాలేజీ అధ్యక్షులు గుర్రెడ్డి, కరస్పాండెంట్ రామారెడ్డి, ట్రెజరర్ సత్యానంద

ఆంధ్రా అసోసియేషన్ జూనియర్ కళాశాల

ప్రజాశక్తి - పెనుమంట్ర

క్రమశిక్షణతో పాటు ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధతో విద్యాబోధన చేస్తున్నామని ఆంధ్రా అసోసియేషన్ (యుకె) జూనియర్ కాలేజీ అధ్యక్షులు డాక్టర్ తేతలి గుర్రెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ తమనంపూడి రామారెడ్డి, ట్రెజరర్ సత్తి సత్యానంద రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలు వెల్లడించారు. పెనుమంట్ర - గుడ్డులో 1993లో ఆంధ్రా అసోసియేషన్ (యుకె) జూనియర్ కాలేజీ నెలకొల్పినట్లు తెలిపారు. గడిచిన విద్యా సంవత్సరంలో వచ్చిన సీనియర్ ఇంటర్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థిని బిఎస్ఎస్‌ఓ.కామాక్షి 988 మార్కులు సాధించి స్టేట్‌లో ఐదో ర్యాంకు సాధించి కాలేజీ విద్యాసౌరభాన్ని ఎగురవేసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కాలేజీ నుంచి ఇప్పటి వరకు 32 మార్కులు రికార్డ్ అన్నారు. ద్వితీయ స్థానంలో జి.హరిత 983 మార్కులు, తృతీయ స్థానంలో వి.మౌనిక 974, సిఇసిలో బిఎల్.శ్రేష్ఠ 908 మార్కులు సాధించారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ విద్యార్థులకు చక్కని విద్య అందించడానికి, వ్యాపారంగా గాక పిల్లల్లో విద్యాప్రతిభ కలిగించాలనే లక్ష్యంతో తక్కువ ఫీజులు తీసుకుంటున్నామని వారు పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం 22 మంది ఇంజినీరింగ్ సీట్లు సాధించి వివిధ ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరారన్నారు. ఎంసెట్‌లో సైతం మంచి ర్యాంకులు పొందారని, ఇంజినీరింగ్ అయ్యాక, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విప్రో, హెచ్‌సిఎల్, టిసిఎస్ బ్యాచ్‌లు వెళ్లగా ఎంపిసి (గ్రూపులో) 988/1000

స్టేట్ ఫిఫ్త్ ర్యాంకు సాధించిన కామాక్షి

తదితర ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఎక్కువ మంది కొలువులు సాధించినట్లు తెలిపారు. తమ కళాశాలను విద్యా సేవగా నిర్వహిస్తున్నామని, ఉపాధ్యక్షులుగా పివిఎం కృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీగా కర్రిబిలి రామిరెడ్డి, కన్వీనర్‌గా కొవ్వూరి లింగారెడ్డి, సభ్యులుగా డి.యోగానందరెడ్డి, పి.భువన సుందరరెడ్డి, ఎస్.వి.రామకృష్ణారెడ్డి, వెలగల సుదర్శనరెడ్డి సేవలు అందిస్తున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ అల్లిసేని సత్యప్రకాష్‌తో పాటు ఫ్యాకల్టీకి చెందిన 10 మంది అధ్యాపకుల నిరంతర కృషితో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా తమ కళాశాల మంచి ఫలితాలు సాధించడం విజయ రహస్యమన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాయకర్

రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నరసాపురం

రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివి ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్‌ను ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ వారు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిఐవంటి సేవా కార్యక్రమాలు అనేక సేవా సంస్థలు ముందుకు వచ్చి చేయడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి, సెక్రటరీ బొమ్మిడి సూర్య కుమారి, ట్రెజరర్ ఆత్మూరి రమ, కొట్ల రామ్‌కుమార్, సిహెచ్ మురళీధర్, అంటే కృష్ణ, తోట శ్రీధర్, విజయ్ కుమార్, పార్థసారథి, బాలు తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో దోమలను అరికడదాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దోమకాటు ప్రజారోగ్యానికి చేటు అని, డ్రైడే డ్రైడే పాటించి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికడదామని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఎన్‌టిఆర్ జంక్షన్ పరిధిలో గొల్లగూడెం, మరో 10వ క్లస్టర్లలో జరుగుతున్న డ్రైడే, డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజిన్ కార్యక్రమాలను సామాజిక ఆరోగ్య అధికారి జె.విల్లసనాబు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీశశ, ఆశా కార్యకర్తలు లక్ష్మీకుమారి, ఆరోగ్య సహాయకులు ఐ.కాంతారావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

నరసాపురం:సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. శుక్రవారం కె.బేతపూడి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సర్వేలపై ఆరా తీశారు. ప్రభుత్వం ఇచ్చిన సర్వేను ఎన్‌ఎంలు పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. అంటువ్యాధి వ్యాపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం కరోనా కేసులు రాష్ట్రంలో నమోదవుతున్నందున ప్రతి ఒక్కరూ ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - గణపవరం

రైతులు వ్యవసాయ భూములకు రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోతుందని వ్యవసాయ శాఖ తాడేపల్లిగూడెం ఎడిఎ పి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం కేశవరం రైతు సేవా కేంద్రంలో జరిగిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ 2025పై రైతులకు అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మిడతాని కామేశ్వరి అధ్యక్షత వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ పురుగు మందులను వీలైనంత వరకు తగ్గించాలన్నారు. అవసరం ఉన్నంతవరకే ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. వెటర్నరీ డాక్టర్ నాగ జ్యోతి మాట్లాడుతూ పశువులకు ఇన్సూరెన్సు చేసుకోవాలని చెప్పారు. గడ్డి విత్తనాలు ఉచ్చే సాగుచేసుకొనే రైతులకు విత్తనాలు అందజేస్తామన్నారు. గణపవరం వ్యవసాయాధికారి వై.ప్రసాద్, ఉండి కెవికె సైంటిస్ట్ బిందు ప్రవీణా, కేశవరం ఎంపిటిసి అచ్యుత రామరాజు పాల్గొన్నారు.

ఛాంబర్స్ విద్యార్థికి ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ జూనియర్ కళాశాలలో ఎంఇసి చదివిన బి.లక్ష్మణ్ పరిక్ష 2023-25 విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నేపథ్యంలో ప్రతిభ అవార్డు గెలుచుకున్నారు. వెయ్యికి 966 మార్కులు సాధించి స్టేట్‌లో 4వ ర్యాంకు సాధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కెఎస్.నరసింహారావు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యనందిస్తూ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్న ఏకైక సంస్థ ఛాంబర్స్ జూనియర్ కళాశాల అని తెలిపారు. అనంతరం కళాశాల సెక్రటరీ కె.సీతారామరాజు, ట్రెజరర్ ఆర్.ప్రవీణ్ భాను, అకడమిక్ అడ్వయిజర్ పిబిఎస్.మూర్తి, ఎస్.సీతారామారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారావు లక్ష్మణ్ పర్షికను అభినందించారు.

'ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేసిన ముదునూరి'

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లానని చెప్పిన మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, ఆ దిశగా చర్యలు చేపట్టకపోగా, ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేశారని జనసేన నాయకులు విమర్శించారు. శుక్రవారం జనసేన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షులు వనంంరావు, డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షులు గుబ్బల మారాజు, ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ వలవల నాని మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనులు వైసిపి నేతలకు కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే నాయకర్ అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. ముదునూరి చేస్తున్న చౌకబారు విమర్శలు తగవని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో శాంతి చంద్రశేఖర్, బందెల రవీంద్ర, గంట కృష్ణ, నిప్పులేటి తారక రామారావు, వాతాడి కనకరాజు, భారతి సురేష్, పోలిశెట్టి సాంబ వల్లభిరెడ్డి రామకోటి కొల్ల జయరాజు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

పాలకొల్లు అర్బన్:పాలకొల్లు నియోజకవర్గంలో రైతాంగానికి అవసరమైన రహదారుల అభివృద్ధికి మంత్రి రామానాయుడు అధిక ప్రాధాన్యత ఇచ్చారని టిడిపి మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ తెలిపారు. పాలకొల్లు మండలంలో రూ.35 లక్షలతో గోరింటాడ నుంచి మేజర్ గుంట వరకూ రెండు కిలోమీటర్ల పొడవునా నిర్మించిన రోడ్డును కూటమి నాయకులు శుక్రవారం పరిశీలించారు. పాలకొల్లు డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ పి.రాంభద్ర రాజు, నాయకులు పాముల రజని, మండెల త్రిమూర్తులు, శీలం సత్యనారాయణ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా బాల మురళీకృష్ణ

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సికి మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా ముప్పాల బాల మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. బాలమురళీ కృష్ణ ఎవిటికర జిల్లా నుండి గణపవరం వచ్చినట్లు కిరణ్మయి చెప్పారు.

రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి

భీమవరం టౌన్:స్వాతంత్ర సమర యోధుడు, కమ్యూనిస్టు అగ్రనేత చండ్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భీమవరం జిల్లా పార్టీ కార్యాలయంలో చండ్ర రాజేశ్వరరావు జయంతిని నిర్వహించి నివాళు లర్పించారు. ఆయన మాట్లాడుతూ పీడిత, అణగారిన వర్గాల అభ్యున్నతికి, శ్రమజీవుల విముక్తి కోసం, కమ్యూనిస్టు ఆశయ సాధనకు తుదిశ్వాస వీడే వరకూ చండ్ర రాజేశ్వరరావు పనిచేశారని కొనియాడారు. చరిత్ర ఉన్నంత వరకూ రాజేశ్వరరావు అందరి హృదయాల్లో నిలిచి ఉంటారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ నాయకులు నాగిడి శాంతమూర్తి, ప్రజా నాట్య మండలి నాయకులు ఛాన్ భాషా పాల్గొన్నారు.

ఘనంగా నీలేంద్ర పుట్టినరోజు

భీమవరం టౌన్:సౌమ్యుడు, స్నేహశీలి నీలేంద్ర అని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం జనసేన మండల కార్యదర్శి కత్తుల నీలేంద్ర పుట్టిన రోజు వేడుకలను ఎంఎల్ఎ అంజిబాబు నివాసం వద్ద నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

10 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపు

కాళ్ల:జీరో నుంచి ఆరేళ్లలోపు వయస్సు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఆధార్ మొబైల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జి.రాణి శుక్రవారం తెలిపారు. మండలంలోని బొండాడ, దొడ్డనపూడి-1, జువ్వలపాలెం, కోలనపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో 16 చోట్ల ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పంచాయతీ గ్రామ కార్యదర్శులందరికీ సూచించామన్నారు. జూన్ 10 నుంచి 8 రోజులపాటు జరిగే క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అచ్చయ్యబాబు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన రాపాక అచ్చయ్యబాబు ఇటీవల చెట్టు కొమ్మలు నరుకుతూ విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో అచ్చయ్య కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎంఎల్ఎ కార్యాలయంలో బొలిశెట్టి రాజేష్, తోట రాజా మిత్ర బృందం, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా రూ 8.లక్షల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆ కుటుంబానికి అండగా ఉంటామని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తోట రాజా, కాళ్ల గోపీకృష్ణ, కోట శ్రీరామ్, సోమా శంకర్రావు, రామకుర్ గణేష్, ఎం.కిరణ్ సోమా రామకృష్ణ పాల్గొన్నారు.

డిసిఎంఎస్ ఛైర్మన్ మురళీకృష్ణకు స్వాగతం

ప్రజాశక్తి - మొగల్తూరు

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన చాగంటి మురళీకృష్ణ (చిన్న)కు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. నాగిడిపాలెం నుంచి అభిమానులతో ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనగా వచ్చారు. బండి ముత్యాలమ్మ విప్ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడుతో కలిసి మురళీకృష్ణ దర్శించు కున్నారు. ఆయన ఇల మోకా అరుణకుమార్ అమ్మవారి శేషపద్మం, ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శనగా నరసాపురం తరలివెళ్లారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

నిరుపేద రోగులకు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు అందిస్తున్న ఆర్థిక సహకారం అభినందనీయమని పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అన్నారు. పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనంలో శుక్రవారం ఐదుగురు రోగులకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షుడు గాంధీ భగవాన్‌రాజు, పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు ప్రముఖుల చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట్రామరాజు చెక్కులు అందజేశారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెనుమత్స బుద్దరాజు, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెక్రటరీ కెఎస్‌పిఎస్.వర్మ, కోసూరి సుబ్బరాజు, చెరుకూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'పల్లె పల్లెకూ మన పితాని'

ప్రజాశక్తి - ఆచంట

ప్రజా సమస్యల పరిష్కార వేదిక పల్లె పల్లెకూ మన పితాని కార్యక్రమమని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెదమల్లం, కోడేరు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు దిరిశాల విజయలక్ష్మి, పెచ్చెట్టి కనకదుర్గాదేవి అధ్యక్షతన పల్లె పల్లెకూ మన పితాని కార్యక్రమం శుక్రవారం జరిగింది. పితాని పాల్గొని మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే చరిత్రలో నిలిచిపోయేలా కీలక హామీలను అమలు చేసినట్లు తెలిపారు. ఈ నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తామన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత సమస్యలు తెలుసుకుని అధికారుల ప్రజా ప్రతినిధుల సమక్షంలో ముఖాముఖీ ద్వారా గ్రామసభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే పల్లె పల్లె కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. నియోజకవర్గ పరిశీలకులు రామారావు, తహశీల్దార్ కనకరాజు, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

9, 13 తేదీల్లో పల్లె పల్లెకూ మన పితాని

పెనుమంట్ర:మండలంలోని నాలుగు గ్రామాల్లో ఈనెల 9, 13 తేదీల్లో పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ 9వ తేదీ సోమవారం ఉదయం సోమరాజు ఇల్లిందలపర్రు, సాయంత్రం మల్లిపూడిలో, 13న మార్టేరు, మల్లిపూడి గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

పుస్తకం పఠనం ప్రగతికి సోపానం

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు ఎంతగానో ఉపకరిస్తాయని, ప్రతి వేసవిలో వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జెపి భీమవరం శాఖా గ్రంథాలయం వద్ద 40 రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతులు ముగింపు, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు టివి, సెల్ ఫోన్లతో సమయాన్ని వృథా చేయకుండా, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన తరగతులు ఎంతో ఉపకరిస్తాయన్నారు. గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావును, వేసవి విజ్ఞాన తరగతుల కన్వీనర్ అల్లు శ్రీనివాస్‌ను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కౌన్సిల్ ఫర్ సిటిజన్స్ వ్యవహారాల కమిటీ మహమ్మద్ సరోజినీ, డాన్స్ మాస్టర్ శ్యామ్ జెపి సత్కరించారు. అల్లు శ్రీనివాస్, మానవతా కోశాధికారి గ్రంథి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, రాజేష్ జైన్, ఐయమ్‌పోర్ శివాజీ వర్మ వి.సోమరాజు,సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం: పుస్తక పఠనం ప్రగతికి సోపానమని వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభకు అధ్యక్షత వహించిన శ్రీనివాస్ మాట్లాడుతూ నేను సమాజంలో పుస్తక పఠనం అంత్యంత ప్రాధాన్యం అన్నారు. అనంతరం చిత్రలేఖనం, క్విజ్, చదరంగం, క్యారమ్స్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వంపన సాయిబాబు,

వీరవాసరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్

గ్రంథపాలకుడు బత్తుల హనుమంతరావు పాల్గొన్నారు.

గణపవరం:గణపవరం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి స్థానిక పెద్దలు కావలిరెడ్డి నాగేశ్వరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ఎస్.సుభాషిణి, గుమ్మడి సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం: ప్రభుత్వ గ్రంథాలయంలో వేసవి సెలవుల సందర్భంగా నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది చిన్నారులు పాల్గొనగా వారికి విద్యార్థులకు ఆటపాటలు నేర్పిస్తూ పిల్లలకు శిక్షణ అందించారు. స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్యాన్స్, యోగా, సైన్స్ ప్రాజెక్టులు, కథలు, స్కిట్స్, కంప్యూటర్ బేసిక్స్ వంటి విభాగాలలో శిక్షణ ఇచ్చారు. సుమారు 200 మంది పిల్లలు ముగింపు కార్యక్రమానికి హాజరై తాము నేర్చుకున్న ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, కథలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీ, క్విజ్ పోటీ చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా వైఎన్ కాలేజ్ ప్రెసిడెంట్ చినమిల్లి సత్యనారాయణ, ఎంఇఒ పుష్పరాజ్యం హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వైఎన్ కాలేజీ ప్రిన్సిపల్ కనకారావు, గ్రంథాలయ కమిటీ సభ్యులు రెడ్డప్ప ధవేజీ, సుధీర్ మోహన్, బాబుజీ, రాష్ట్ర ఉమెన్ కమిషన్ మాజీ సభ్యురాలు డా.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్‌ను, అతిథులను సత్కరించారు.

ఆకివీడు : శిబిరంలో పొందిన శిక్షణను నిరంతరం సాధన చేసి వాటి ఫలితాన్ని పొందాలని విద్యార్థులకు వక్తలు అన్నవేట్ నెల్లి సతీష్ కుమార్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుని కాకర్ల రాజారామ్మోహనరావు సూచించారు. పది రోజులుగా మాదివాడలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం స్వాంత్ర పోరాటంలో పాల్గొన్న దేశభక్తుల చిత్రాలు, మంచి అలవాట్లను పెంపొందించే విధంగా తయారు చేయడంలో పఠనాలు, తెలుగు మీడియం ఎక్కాల పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు పల్నాటి కిషోర్ కుమార్, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ, ఆదర్శ లయన్స్ క్లబ్ కార్యదర్శి మోర జ్యోతి, నాయకులు మాట్లాడారు.

తాడేపల్లిగూడెం: ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో చేపట్టిన వేసవి శిక్షణ తరగతులు ముగిశాయని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోయెంకా ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ వి.గణపతిరావు పాల్గొని మాట్లాడారు. ఈ తరగతులు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రంథాలయాధికారి నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. రిసోర్స్ పర్సన్స్ గరికపాటి బాపయ్య శర్మ ప్రొ.వీరాస్వామి, కె.శ్రీనివాసరావు, వి.జనార్ధనరావు, ఎం.ప్రవల్లిక పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, వడ్లమాను గ్రామ వాస్తవ్యులు సాదం వెంకటేశ్వరరావు గారి కుమారుడు సాదం రంగారావు పేరున ఆగిరిపల్లి మండలం, వడ్లమాను రెవెన్యూ గ్రామంలోని ఆర్.ఎస్.నెం. 345/14లో రావాల్సిన ఎ.సె. 484ల నివేశన స్థలానికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు నెం.(2437/2000) డి.02-06-2025వ తేదీన పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

సాదం రంగారావు
తండ్రి: వెంకటేశ్వర్రావు
వడ్లమాను గ్రామం
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా
సెల్ నెం : 99630 68227

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814